సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్



భవానీపురంలో పర్యటిస్తున్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని భవానీపురంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని భవానీపురంలో నెలకొన్న సమస్యలపై స్థానిక నాయకులతో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నాలా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సునీతారెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నల్ల సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్, కాలనీవాసులు సుందర్, గౌస్, కృష్ణారెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, పర్వతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.55.78 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

అమీన్‌పూర్ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్

పటాన్‌చెరు: ఈ ఆర్థిక ఏడాదికి అమీన్‌పూర్ పురపాలక వార్షిక సాధారణ అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. సోమవారం అమీన్‌పూర్ పురపాలక సంఘం కార్యాలయంలో చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. మొత్తం రూ.5578.30 లక్షలు అందులో పన్నురాబడి నుండి రూ.2800.00 లక్షలు, పన్నేతర రాబడి క్రింద రూ.2778.30 లక్షలు, మరియు 2023–2024 ఆర్థిక సంవత్సరానికి మిగులు రూ.60.71 లక్షలుగా అంచనా వేశారు. సమావేశం వివరాలను చైర్మన్ పాండురంగారెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. అమీన్‌పూర్ మున్సిపల్ బడ్జెట్ వివరాలివే...పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) ఉద్యోగుల జీతభత్యాలకు రూ. 900.00 లక్షలు, పారిశుద్ధ్య నిర్వహణ ఖర్చులకు రూ.535.00 లక్షలు, కరెంటు బిల్లులకు రూ.90.00 లక్షలు, ఋణ వాయిదాల చెల్లింపులకు రూ.30.00 లక్షలు మరియు 10% నిధులను హరితహారం పనులకు రూ.557.80 లక్షలుగా చూపారు. చార్జ్‌డ్ వ్యయాలకు మొత్తం రూ. 2112.80 లక్షలుగా కేటాయించారు. వాటితో పాటు ఇతర నిర్వహణ ఖర్చులకు రూ.487.10 లక్షలుగా కేటాయించారు.మిగిలిన పురపాలక సంఘ సొంత నిధులలో 1/3 వ వంతు నిధులను అనగా రూ. 992.83 లక్షలను పురపాలక సంఘంలోని అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాల ప్రజలు నివసించే ప్రాంతాలు, మైనారిటీ ప్రజలు నివసించే ప్రాంతాలలో మరియు మురికివాడల ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు తెలిపారు. మిగిలిన నిధులను పార్కులు, వైకుంఠధామాల అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, సమీకృత సంతల అభివృద్ధి, జంతువధ శాలల నిర్మాణం, శాస్త్రీయ పద్ధతిలో డంపు యార్డుల నిర్వహణకు, వివిధ వార్డులలో అభివృద్ధి పనులకు మరియు రూ.1930.00 లక్షలను ఇతర మూలధన వ్యయాలకు కేటాయించారు.రూ. 60.71 లక్షలను అంచనా మిగులుగా చూపారు. .కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి గ్రాంట్ల రూపంలో రూ. 369.91 లక్షలుగా అంచనా వేయటం జరిగిందని చైర్మన్ పాండురంగారెడ్డి వెల్లడించారు.

చేవెళ్ల ఎంపీ సీటు బీజేపీదే



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి: రానున్న పార్లమెంటు ఎన్నికలలో చేవెళ్ళ ఎంపీ సీటు బీజేపీదేనని మాజీ పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలోని మసీదుబండలో బీజేపీ చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గం సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు.బూత్ స్థాయి నుంచి నియోజకవర్గం స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా అందరూ సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. శేరిలింగంపల్లిలో మంచి మెజార్టీ సాధించేలా అందరూ కష్టపడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ రాఘవేందర్‌రావు, నాయకులు రవీందర్‌రావు, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాగులుగౌడ్, రామరాజు, నవతారెడ్డి, బుచ్చిరెడ్డి, విజయలక్ష్మీ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు, జిల్లా, డివిజన్, బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్ర



ఆల్విన్‌కాలనీ : ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే గాంధీ, మాధవరం రంగారావు తదితరులు

శేరిలింగంపల్లి/ మియాపూర్: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మియాపూర్ శివాలయం నుంచి తారానగర్ శ్రీ తుల్జాభవానీ ఆలయం వరకు శోభయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి కుమార్‌యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ ధర్మానికి హాని జరిగినప్పుడు వారిపై పోరాడిన ధీరుడు శివాజీ మహారాజ్ అని కొనియాడారు.

గోపీనగర్‌లో..

శేరిలింగంపల్లి గోపీనగర్‌లో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు నీరటి చంద్రమోహన్ ఛత్రపతి శివాజీ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కేశవ్, శ్రీనివాస్, ఆకాష్, జగదీష్, రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్



గోపీనగర్‌లో... నివాళులర్పిస్తున్న నాయకులు నీరటి చంద్రమోహన్ తదితరులు

సంత.. సమస్య

- రోడ్లపై సంతల నిర్వహణతో వాహనదారుల ఇక్కట్లు
- రాకపోకలకు ఇబ్బందులు
- ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని వినతి



రోడ్లపై సంతలో కిక్కిరిసిన జనం, ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మియాపూర్: ప్రధాన, అంతర్గత రహదారులపై ఏర్పాటు చేస్తున్న కూరగాయల మార్కెట్లతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసుల వద్దకే కూరగాయలు విక్రయించేందుకు వారాంతపు సంతలు ఏర్పాటవుతున్నా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు రోడ్లపై నిలిచిపోతున్నాయి. కూరగాయలు కొనడానికి వచ్చిన వాహనదారులు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపివేసి కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్తున్నారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు పార్క్ చేసిన వాహనాలు తీసే వరకు కదలడం లేదు. దీంతో పాదచారులు కూడా ఇక్కట్లు పడుతున్నారు.

◆ మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల్లో వారంలో ఓ రోజు ఏదో ఒక కాలనీలో సంతలను నిర్వహిస్తున్నారు. పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు, దీప్తిశ్రీనగర్, జేపీనగర్, డీకే ఎన్‌క్లేవ్, న్యూ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ రోడ్లపై సంతల కారణంగా సమస్యలు ఏర్పడుతున్నాయి. సమీపంలోని అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నుంచి అడుగు పెట్టేందుకు

◆ వ్యాపారులు మిగిలిన కూరగాయలు, వ్యర్థాలను రోడ్డుపైనే పారవేస్తుండడంతో ఆ ప్రాంతమంతా చెత్త, చెదారంతో నిండిపోతోంది. దీన్ని వెంటనే తొలగించకపోవడంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

తీసుకోవాల్సిన చర్యలు ...

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన మోడల్ మార్కెట్లు, స్ట్రీట్ వెండర్ దుకాణాలను అందుబాటులోకి తీసుకురావాలి.

◆ కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో సంతలు ఏర్పాటు చేసే విధంగా చూడాలి.

◆ సంతలు జరిగే రోజుల్లో ట్రాఫిక్ పోలీసులు కానీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు గానీ ఆ ప్రాంతంలో ఉండి వాహనాలు వేరే మార్గంలో వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. -మిగిలిపోయిన ,పాడైన కూరగాయలను ఇతర వ్యర్థాలను వేసేందుకు డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలి.





కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 55, బెండ 65, కాకర 60, దొండ 60, దోస 30, ఆలు 25, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (3)20, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 200, వెల్లుల్లి 350.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: రాయదుర్గంలోని లక్ష్మణ్‌బాగ్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయి. 22వ తేదీ కల్యాణోత్సవం, 24వ తేదీన రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో నిత్యం అర్చనలు, అష్టోత్తర పూజలు, అభిషేకాలు, సామూహిక పారాయణాలు జరగనున్నాయి.

ప్రజావాణి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 7 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. టౌన్ ప్లానింగ్‌కు నాలుగు, రెవెన్యూ సెక్షన్‌కు రెండు, యూసీడీ సెక్షన్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఈఈ శ్రీనివాస్, ఏసీపీ మెహ్రా, ఏఎంసీ నరేందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

రక్తదానం

పటాన్‌చెరు టౌన్: మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం స్ఫూర్తిదాయకమని పటాన్‌చెరు మరాఠాసేన అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని గౌతంనగర్ కాలనీలో మరాఠ సేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు పాల్గొని రక్తదానం చేశారు.

ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: సాయినగర్‌లోని శ్రీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటలకు పంచకుండాత్మక గురు కటాక్ష హోమం, 10.30 గంటలకు లక్ష పుష్పార్చన, మధ్యాహ్నం 1 గంటకు అన్నదానం, సాయంత్రం 6.30 గంటలకు కోలాటాలతో పల్లకి సేవ, రాత్రి 9 గంటలకు శేజ్‌హారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ఎస్. కపిల్‌రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు పవన్ కుమారాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

కుమారుడి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: కుమారుడి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని గండిగూడెంకు చెందిన మహబూబ్ బీ, ఖాజామియాల చిన్న కుమారుడు బురాన్(31) ఆటో డ్రైవర్. ఈనెల 17 తేదీన ఆటో తీసుకు వెళ్ళిన బురాన్ సాయంత్రం కూడా ఇంటికి రాలేదు. దీంతో ఆటో యజమాని రమేష్ బురాన్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు.బురాన్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అదృశ్యంపై తల్లి మహబూబ్ బీ సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కౌన్సిల్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు



జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: మూడు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు...శానిటేషన్, డ్రైనేజీ పనులు చేయకుండా వ్యవస్థలను నిర్వీర్యం చేశారని జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గళంవిప్పారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. జోనల్ కమిషనర్లుగా ఐఏఎస్ అధికారులను నియమిస్తే సంతోషించామని, ఒక్క రూపాయి లేని వ్యవస్థను అప్పజెప్పడంతో నిధులు మంజూరు కావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయంలో నెలకు జోనల్‌కు రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యేవని, కనీసం రూ.4 కోట్లు కూడా విడుదల చేయలేదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. చెరువుల కబ్జాలను అడ్డుకొని సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు.

అధ్యాపకులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు



మాట్లాడుతున్న వీసీ బీజేరావు

రాయదుర్గం: అధ్యాపకులు విద్యాబోధనలో ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా బోధించాలన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని హెచ్‌ఆర్‌డీసీలో యూజీసీ-మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (యూజీసీ-ఎంఎంటీటీసీ), టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్‌ఆర్), హోమీ బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్‌ల సహకారంతో ఫిజిక్స్ టీచర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యను అభివృద్ధి చేయడానికి కొత్తకొత్త మార్పులకు అనుగుణంగా బోధనలో మార్పులు తీసుకరావాలనే తపనతో యూజీసీ ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీఐఎఫ్‌ఆర్ ప్రతినిధులు ప్రొఫెసర్ ఎం కృష్ణమూర్తి, డాక్టర్ శిరీష్‌పతారే, స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ డీన్ ప్రొఫెసర్ కేజీ ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ జి మనోజ్‌కుమార్, ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు ప్రసంగించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



పూజల్లో పాల్గొన్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు

రాయదుర్గం: గోపన్‌పల్లిలో సోమవారం నాభిశిల బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి పూజ ,అభిషేకాల అనంతరం బొడ్రాయికి పూజ చేశారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, గోపన్‌పల్లివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పూర్వం ప్రతి గ్రామంలో బొడ్రాయిని విధిగా ప్రతిష్ఠించే వారని గుర్తు చేశారు. ప్రస్తుతం పట్టణీకరణతో కొత్తకొత్త కాలనీలు ,బస్తీలు ఏర్పడడంతో ఈ బొడ్రాయి సంస్కృతి కనుమరుగయిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోచయ్య, రవీందర్‌ప్రసాద్ దూబే, చంద్రమౌళి, నర్సింహ, యాదయ్య, రాజు, రాజేందర్, అనిల్, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమిషన్లను అందజేసిన తూము నిఖిల్ కుమార్, గోపాల్

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసుకుని.. సర్టిఫికెట్లు పొందిన మహిళలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేస్తున్న కుట్టుమిషన్లను సోమవారం కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తూము నిఖిల్‌కుమార్, సీనియర్ నాయకులు జిల్లా గోపాల్‌తో కలిసి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళలు ఎవరిమీద ఆధారపడకుండా వారు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరాలనే ఆశయంతో పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఖార్డు స్వచ్ఛంద సంస్థ ఉచితంగా శిక్షణ అందించి నేడు 200కు పైగా మిషన్లు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, వేణు, బాలురావు, మనోజ్, తుకారాం, విష్ణు, రవిసింగ్, జైరాజ్, అరుణ్, శ్యామల, మంగమ్మ, రమాదేవి, సుజాత, శాంత, పద్మ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్- 21 ఈఈగా రాజు



హఫీజ్‌పేట్ : చందానగర్ సర్కిల్ 21 ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్‌గా కెవిఎస్ రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని అల్వాల్ సర్కిల్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న కెవిఎస్ రాజు చందానగర్ సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. ఈఈ శ్రీకాంతిని అల్వాల్ సర్కిల్‌కు వెళ్ళారు.

మేడారానికి ప్రత్యేక బస్సులు

జగద్గిరిగుట్ట: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎం ఇసాక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 19 బస్సులు జాతర ముగిసే వరకు (వారం రోజుల పాటు) అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.

సీపీ అవినాష్ మహంతిని కలిసిన 'ఎస్కి' బృందం



రాయదుర్గం: సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతిని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా అధికారుల బృందం సోమవారం కలిసింది. ఎస్కి డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు, అధికారుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎస్కి పనితీరు, నిర్వహించే కోర్సులు, శిక్షణా కార్య క్రమాలను ఆయన వివరించారు . తాజాగా సైబర్ సెక్యూరిటీ, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ఎస్కి శిక్షణా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా విచ్చేయాలని కోరగా సీపీ అంగీకరించారని తెలిపారు.

పటాన్‌చెరు ఎంవీఐ విజయరావు బాధ్యతల స్వీకరణ



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విజయరావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంవీఐ రాజా మహమ్మద్ కోదాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ...వాహన చోదకులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జంక్షన్ల మార్పు.. విద్యుత్ సమస్యలకు చెక్



రాయదుర్గం: విద్యుత్ సమస్యలకు చెక్ పడింది. చాలారోజుల తర్వాత రాయదుర్గంలోని బీజేఆర్‌వై బస్తీలో విద్యుత్ సమస్యలు తలెత్తేవి. సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోవడంతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తేవి. దీంతో విద్యుత్ అధికారులు బస్తీలో కొనసాగుతున్న జంక్షన్లను పూర్తిగా తొలగించి కొత్త వాటిని సోమవారం ఏర్పాటు చేయడంతో బస్తీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

దోమల నివారణకు చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుటున్నామని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు తెలిపారు. సోమవారం బొల్లారం మున్సిపల్ పరిధిలో దోమల నివారణకు పిచికారీ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ ఏఈ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం

రూ.10 లక్షలు పోగొట్టుకున్న మొబైల్‌షాప్ వ్యాపారి

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ వ్యక్తి రూ.10 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని కిష్టారెడ్డిపేట్‌కు చెందిన మొబైల్ షాప్ వ్యాపారికి గత ఏడాది నవంబర్ 15వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్ లో నమోదు చేశాడు. నిర్వాహకులు ఒక ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు.దీంతో ఆ వ్యాపారి నగదును ఇన్వెస్ట్ చేస్తు వచ్చాడు. పెట్టిన నగదుతో పాటు కమీషన్ చూపిస్తూ వచ్చాడు .అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.10 లక్షలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ లో సోమవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పటేల్‌గూడలో మెకానికల్ ఇంజనీర్..

అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన మెకానికల్ ఇంజనీర్‌కి గత ఏడాది అక్టోబర్ 28వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ టెలిగ్రామ్ ద్వారా వచ్చింది. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఆన్ లైన్ ట్రేడింగ్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. ఈ క్రమంలో నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేస్తు వచ్చాడు. అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.8 లక్షల 29 వేలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పీఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు.

మల్లిఖార్జునస్వామి జాతర

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో మల్లిఖార్జునస్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉంచి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డె కృష్ణ, మాజీ సర్పంచ్‌లు చిట్ల సత్యనారాయణ, నవీన్,శ్రీకాంత్‌రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి.

21న శివాలయం వార్షికోత్సవం

మోతీనగర్: వి.రామారావునగర్ స్నేహపురి కాలనీలోని శివపార్వతుల ఆలయంలో ఈనెల 21న వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8.30 గంటలకు స్వామివార్లకు విశేష పూజలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.